## దేశ బాసలందు తెలుగు లెస్స



భాష ప్రాణమైతే లిపి శరీరం లాంటిది. శరీరం వినా ప్రాణానికి మనుగడ వుండదు. శరీరం లాంటి ఆ లిపి క్రీ.పూ. 3వ శతాబ్ధంలో తొలి తెలుగు శాసనం లభించడంతో మన భాష ప్రాచీనత సంతరించుకొని ప్రభుత్వం చేత గుర్తింపుకు నోచుకొంది. ఈ పుస్తకాన్ని ఆసాంతం చదివితే – సర్వాంగ సుందరమైన మన తెలుగు భాష ఇంత గొప్పదా! అని ప్రతి ఆంధ్రుడూ గర్విస్తూ తన్మయత్వం జెందుతాడు. ఈ పుస్తకాన్ని ప్రభుత్వం చదివితే – ప్రపంచ భాషలన్నింటిలో స్వరయుక్తమైన భాషగా ద్వితీయ స్థానం సంపాదించి గణుతి కెక్కిన మన మాతృభాషను ఇంత నిర్లక్ష్యం చేస్తున్నామా! అని ప్రభుత్వం కుమిలి కుమిలి కుంచించుకు పోతుంది. శిరపింఛ సాదృశ్యమైన తల కట్టుతో, చంద్రంబింబ సమానమైన వలయాకారంతో ఠీవిగా నిలబడే అక్షర సముదాయం గల ఏకైక భాష మన తెలుగు భాష ఒక్కటే. అల్లాంటి ఘనకీర్తి గల్గిన భాషామ తల్లి నేను చిక్కశల్యమైన కుక్కి మంచాన అనాదరంగా పడి వుంది. ఈ తల్లి ఆరోగ్యవంతం చేయడానికి సభలూ, సమావేశాలూ , జరపడం కాలక్షేపం మాత్రమే. దేశ విదేశ సంస్థలన్నీ ఏకత్రితమై ప్రభుత్వాన్ని తట్టి లేపాలి. భాషా వికాసానికి నిర్దష్టమైన ప్రణాళిక సూచించాల. పోరాట పఠిమతో ఉద్యమించాలి. మిత్రులు క్రిష్ణయ్య గారు ఎంతో శ్రమించి, పరిశోధించి, భాషాపరమైన అనేకానేక విషయాలతోపూర్ణకుంభాన్ని మన సమాజం ముందుంచారు. ఇది అన్ని తరాల వారి అనుమానాలకు సంశయ నివృత్తి జేయగలదని చెప్పనగును. తెలుగు భాషకు వెలుగు జూపే ప్రయత్నం ప్రభుత్వమే చేయాలి. అదే ప్రాధమిక దశ నుండీ “సిలబస్” సరిజేసుకోవడం.

**రాజా శివానంద**
హైదరాబాద్

## తెలుగు భాషాజ్యోతి వెలుగులు వెదజల్లిన శిల్పి



నిత్య సత్య పరిశీలకులు, విషయ సుస్పష్టవ్యక్త నిపుణ శిల్పి శ్రీ కేకలతూరి క్రిష్ణయ్య గారు రచించిన పదిహేడును పరిశోధనా గ్రంథములే. అవి విభిన్న విపుల విషయ సిరులు. విశిష్ట విషయ సంగ్రహణా నిధులు. విశ్వజన ప్రయోజనకరములు. సందేశాత్మకములు, ప్రౌఢభావోన్నతములు. ఇట్టి సమాజ హితవరి రచించిన ఈ గ్రంథము సామాన్యులకు పండితులకు భాష, మాతృభాష. తెలుగు భాషల పట్ల చక్కని అవగాహన గల్గించును. మానవ మనుగడ కత్యంతావశ్యకమగు భాష లెప్పుడెక్కడెట్లు పుట్టెనో, వ్యాపించెనో తెల్పును. ఐత్రేయారణక్యయజుర్వేద సూక్తములను, సాన్, పపువాన్, టిబెటో బర్మన్, ఆస్ట్రో ఆసియాటిక్ ఇండో యూరోపియన్ మొదలగు భాషల చరిత్రను తెల్పును. సంస్కృతిని వివరించును.వ్యాప్తి నెఱిగించును. మానవుని సర్వతోముఖాభివృద్ధికి మాతృభాష దోహదపడు విధమును ప్రపంచమున మాతృభాషాభివృద్ధి దేశములలో పెరిగిన విజ్ఞాన శాస్త్ర సాంకేతిక నైపుణ్యము. తద్వారా ఆయా దేశముల సాంఘిక, ఆర్థిక, యశోప్రగతులను సోదాహరణముగా యిందు తెలుపబడినది అని పఠితుల హృదయమున మాతృ భాషాభిమాన బీజములను విత్తును. తెలుగు భాష పుట్టు పూర్వోత్తరములు, ఎవ్వరూ గతములో చెప్పని రీతిలో రచయిత ఈ గ్రంథమున వినూత్నముగ తెలిపెను. అచ్చులు, హల్లులు, వ్యాకరణాంశములు, జరిగిన మార్పులు క్రమపద్ధతిలో తెల్పెను. రాజులు, శాసనములు, పురాణములు, కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు, గేయములు, పదకవీతలు వివిధ సాహిత్య ప్రక్రియలలో భాష వృద్ధి చెందిన వైనము. వానిని సృష్టించిన కవులు, పండితులు కళాకారులు వానిని పోషించిన రాజులను ఆయా కాలాలతో బాటు విశదపరచెను. కార్పోరేట్ విద్యా వ్యాపార సంస్థల విష ప్రచారముతో ఆంగ్ల భాషా వ్యామోహములో తచ్చాడు వారికి తెలుగు భాషా జ్యోతి వెలుగుల సుగతులనేర్పాటు చేసిన రచయిత తెలుగు భాషా వైభవమును విదేశీయ మహాత్ములు, పొరుగు రాష్ట్ర మాన్యులు, మన రాష్ట్ర పండితులు ప్రశంసించిన విధము, భాష గొప్పదనమునుభాషా ప్రజలను భాషా సంస్కృతిని, ప్రపంచవిస్తరణను, విదేశ విశ్వవిద్యాలయ బోధన శాఖలనుపీఠములను స్పష్టపరచెను. ఇట్టి భాషాభివృద్ధికై ప్రభుత్వము పాటుపడవలెనని వీరు సూచించిన సూచనలు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకొన్నది.

మహాకవి విద్యాన్ **చలంకోట బురుజు మునస్వామి**
చిత్తూరు